# ఆరు

"హలో... నాకు డెప్యూటీ కమీషనర్ గారు కావాలి."

"మీ పేరు?"

"మాధవరావు, నాకు మీ డి.సి.పి.గారు బాగా తెలుసు. ఆయనతో అత్యవసరంగా మాట్లాడాలి. ఆయన ఉన్నారా?"

"లైన్‌లో ఉండండి. ఉన్నారో లేదో చూసి చెప్తాను .... ఆ ఉన్నారు. కనక్షన్ ఇస్తున్నాను. మాట్లాడండి" పావు నిముషం తర్వాత, "రామానుజం" అని వినిపించింది.

"నమస్కారమండీ, నా పేరు మాధవరావు. నేషనల్ టూల్స్‌లో రెండు నెలల కిందటి వరకు జనరలల్ మేనేజర్‌గా పనిచేసి రిటైర్ అయ్యాను. మునుపటి డి.సి.పి. నరహరి గారికి బంధువునవుతాను. సంవత్సరం కిందట నరహరి గారింట్లో జరిగిన ఒక పార్టీలో మనిద్దరం కలుసుకున్నాం. నాతో చాలాసేపు మాట్లాడారు. గుర్తు వచ్చానా?" అడిగాడు.

"లేదు. మీకు ఏం కావాలో చెప్పండి" అన్నాడు రామానుజం విసుగ్గా.

"నన్నెవరో చంపాలని ప్రయత్నిస్తున్నారు."

"చంపాలనా?"

"అవును."

"మీకు శత్రువులు ఎవరయినా ఉన్నారా?"

"లేరు. ఒకరితో పోట్లాడే మనస్తత్వం కాదు నాది. నాకు తెలిసి ఎవరికీ అపకారం చేయలేదు.మీరు నేషనల్ టూల్స్‌లో పనిచేసే వాళ్లను ఎవరిని అడిగినా, నా గురించి చెబుతారు. నాకు పోలీసు రక్షణ కావాలి."

"మీరొక పని చేయండి."

"చెప్పండి."

"మీరెక్కడ ఉంటున్నారు?"

చెప్పాడు మాధవరావు.

"మీ ఏరియా చిలకలగూడ పోలీస్ స్టేషన్ కిందకు వస్తుంది. కంట్రోల్ రూమ్‌కు ఫోను చేస్తే మీకా పోలీసుస్టేషన్‌కు కనక్షన్ ఇస్తారు. ముందు వాళ్లతో ఫోన్‌లో మాట్లాడండి. అక్కడకు వెళ్ళి కంప్లెయింట్ రాసిస్తే మరీ మంచిది. వాళ్ళు మీకు తప్పకుండా సహాయం చేస్తారు" అన్నాడు రామానుజం.

"ఈ ఉదయాన్నే వెళ్ళి ఎస్.ఐ.ని కలిసి కంప్లెయింట్ రాసిచ్చాను. ఇంతవరకు ఎవరూ రాలేదు. నాకు భయంగా ఉంది".

"మీ ఇంట్లో మీతో పాటు ఇంకెవరు ఉంటున్నారు?"

"మా అబ్బాయి."

"అతనికి ఎంత వయసుంటుంది?"

"ఇరవై అయిదు సంవత్సరాలు."

"మరింకేం?"

"మా వాడికి నేను మీతో చెప్పిన విషయాలేమీ చెప్పలేదు. చెప్పినా నమ్మడు. వాడు నా మాటల్ని ఎప్పుడూ సీరియస్‌గా తీసుకోడు. రెండునెలల కిందట నన్ను చంపుతానని బెదిరిస్తూ ఎవరో ఉత్తరం రాసారు."

"ఆ ఉత్తరం మీ దగ్గర ఉందా?"

"లేదు, చించి పారేశాను. నెల కిందట అలాటిదే ఇంకోటి వచ్చింది. దాన్నీ చించేశాను."

"వాటిని ఉంచితే బావుండేది. మా వాళ్లకు ఉపయోగకరంగా ఉండేవి. వాటిల్లో మిమ్మల్ని ఎందుకు చంపాలనుకుంటున్నారో కారణం రాసారా?"

"రాయలేదు. రెండే రెండు మాటలు. కిందపేరు లేదు. వాటిని సీరియస్‌గా తీసుకోవాలని అనిపించలేదు. రెండురోజుల కిందట రాత్రి ఎనిమిది గంటలప్పుడు ఎవరో ఆవిడ ఫోన్ చేసి అమావాస్య లోపల నన్ను చంపుతానని బెదిరించి నేను ఎవరు, ఏమిటి అని అడిగే లోపల ఫోను పెట్టేసింది."

"ఆవిడ కంఠస్వరాన్ని బట్టి ఆవిడెవరో గుర్తు పట్టగలరా?"

"చాలాసేపు ప్రయత్నించాను. గుర్తురాలేదు."

ఆ సి.ఐ.కి ఫోను చేసి చెప్తాను. ధైర్యంగా ఉండండి. మీరు చెప్పిన దాన్నిబట్టి ఎవరో ఏం తోచక మిమ్మల్ని ఆట పట్టిస్తున్నారేమో అని నాకు అనిపిస్తోంది. మీరు ఇప్పుడు ఎక్కడ నుండి మాట్లాడుతున్నారు?"

"ఇంటి నుండి."

"మీ ఫోను నెంబరు చెప్పండి."

మాధవరావు చెప్పాడు.

"అడ్రసు చెప్పమంటారా?"

"అక్కర్లేదు. మా వాళ్ళు కనుక్కుంటారు. మీ కంప్లెయింట్‌లో రాసి ఉంటారు కదా?" అడిగాడు రామానుజం.

"రాసాను". మాధవరావు అతనికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాడు, అవతల వైపునుండి ఫోను పెట్టేసిన చప్పుడయింది.

మాధవరావు రిసీవరు క్రెడిల్ చేసి దీర్ఘంగా నిట్టూర్చాడు. రామానుజంతో మాట్లాడిన తర్వాత తన హృదయభారం, ఆందోళన తగ్గినట్లనిపించింది. మంచం మీద కూర్చుని సిగరెట్ వెలిగించాడు. ఆరిపోయిన అగ్గిపుల్లను కిటికీలోంచి బయటకు విసిరి వెనక్కివాలి దిండు మీద తలవాల్చి గోడ మీదున్న కేలండర్ వైపు చూశాడు. రేపు దాటితే అమావాస్య. రామానుజం అభయహస్తం ఇచ్చాడు కదా! తనకేం అపకారం జరగక పోవచ్చు. చేతిగడియారం వంక చూసుకున్నాడు. తొమ్మిదీ నలభయి అయింది. గదిలో ట్యూబులైటు వెలుగుతోంది. ఫేను వేగంగా తిరుగుతున్నా ఉక్కగా ఉన్నట్టు అనిపిస్తోంది. గుండె నిండా పొగ పీల్చుకుంటుంటే అతనికి సావిత్రి గుర్తు వచ్చింది. తను సిగరెట్లు తాగటం సావిత్రికి బొత్తిగా ఇష్టం ఉండేది కాదు. ఎన్నో సిగరెట్ పెట్టెలు బయట మురికి గుంటలో పడేసేది. సావిత్రి చనిపోయి పదిహేను సంవత్సరాలు కావస్తున్నా ప్రతి కొత్త సిగరెట్ పెట్టె తెరుస్తున్నప్పుడల్లా గుర్తు వస్తుంటుంది. మర్చిపోలేదు.

సావిత్రి అతని మొదటిభార్య. సావిత్రిని చేసుకున్న తర్వాత అతనికి చాలా కలిసి వచ్చింది. తెలిసిన వాళ్ళు అతను ఎదిగి పోవటానికి కారణం ఆమే అంటారు. అతను ఎదిగి స్థిరపడ్డాక కూడా ఆమె ఆగలేదని కూడా అప్పట్లో అనుకునేవాళ్ళు. విజయవాడ పుష్కరాల్లో స్నానం చేస్తుండగా సావిత్రి నదిలో కొట్టుకుపోయింది. ఎంత వెతికినా ఆమె శవం దొరకలేదు. ఆమె నదిలో కొట్టుకు పోవటం చాలామంది చూశారు. ఆమె చనిపోవటానికి కారణం మాధవరావేనని ఆమెతో చాలా సన్నిహితంగా మెలిగిన వ్యక్తులు చెవులు కొరుక్కున్నారు. సంవత్సరం ఆగి మాధవరావు నాగమణిని పెళ్ళి చేసుకున్నాడు. నాగమణికి పిల్లలు కలగలేదు. నాగమణి అయిదు సంవత్సరాల కిందట చనిపోయింది. నరహరి సావిత్రికి పుట్టినవాడు.

చివరంటా కాలిన సిగరెట్ కిటికీలోంచి బయటకు విసిరి మంచం దిగి కిటికీ దగ్గరకు వచ్చి గోడకానుకుని నిలబడి బయటకు చూశాడు. చల్లటి గాలి వీస్తోంది. వర్షం వచ్చేట్టుగా ఉంది. ఆకాశం ఉండుండి మెరుస్తోంది. వీధి దీపపు మసకవెలుతురు

గాలికి ఊగుతోంది. రోడ్డు కవతల ఎవరో నుంచున్నట్లు అనిపించింది. పరీక్షగా చూశాడు. పోలీసు దుస్తుల్లో ఉన్న మనిషి నిలబడి ఉన్నాడు. మాధవరావు తేలికగా ఊపిరి తీసుకుని వదిలాడు. రామానుజం తన మాట నిలబెట్టుకున్నాడు. సంబంధిత వాళ్లకు చెప్పి పోలీసును పంపించేలా చూశాడు. తనిక భయపడనవసరం లేదు అనుకుంటూ వెనక్కి తిరిగి చూశాడు. నరహరి పాలగ్లాసుతో గదిలోకి వచ్చి తండ్రికి గ్లాసిచ్చి, "మాత్రలు తీసుకున్నారా?" అడిగాడు.

"వేసుకున్నాను" అని నాలుగయిదు గుటకల్లో పాలగ్లాసును ఖాళీ చేసి నరహరికిచ్చాడు.

"పడుకునే ముందు ఆ కిటికీ తలుపులు మూసేయటం మర్చిపోకండి. ఏవనా కావలసివస్తే నన్ను లేపండి"

తలూపి "చిన్నీ! రోడ్డు అవతల ఎవరో ఉన్నట్లున్నారు... చూడు..." అన్నాడు మాధవరావు.

నరహరి కిటికీ దగ్గరకు వచ్చి బయటకు చూశాడు. అతనికి ఎవరూ కనిపించలేదు. "ఎవరూ లేరు నాన్నా" అన్నాడు.

"సరిగ్గా చూడరా. ఇందాక నేను పోలీసు నిలబడి ఉండటం చూశాను."

"పోలీసా?" నరహరి ఆశ్చర్యపోయాడు.

తలూపాడు.

మళ్ళీ ఒకసారి బయటకు చూసి, "ఎవరూ లేరు నాన్నా- నాకు తెలియక అడుగుతాను. పోలీసులంటే మీరెందుకంత భయపడుతుంటారు?" విసుగు ధ్వనించకుండా నవ్వుతూ అడిగి తండ్రి జవాబు కోసం ఎదురుచూడకుండా గదిలోంచి బయటకు నడిచి తలుపు దగ్గిరగా వేసి గ్లాసు వంటగదిలోని వాష్ బేసిన్‌లో పెట్టి తన గదిలోకి వెళ్లి లైటు ఆర్పి మంచం మీద పడుకుని కళ్ళు మూసుకున్నాడు నరహరి. వెంటనే నిద్ర పట్టింది.

పదింబావయింది. మాధవరావు కిటికీ దగ్గర నిలబడి బయటకు చూశాడు. జల్లు పడుతోంది. పోలీసు కాంపౌండు గేటు దగ్గర నిలబడి ఉన్నాడు. మరి నరహరికి ఎందుకు కనబడలేదు. వాడు చూసే సమయానికి పోలీసు గోడపక్కగా వెళ్లి ఉండాలి. అందుకని కనిపించి ఉండి ఉండడు అనుకున్నాడు. వాడన్నట్టు తనకు పోలీసులంటే భయమా? ప్రశ్నించుకున్నాడు. లేదే. లేదు. తనెందుకు వాళ్లకు భయపడాలి? సావిత్రి కృష్ణలో కొట్టుకుపోయిన కొత్తలో వాళ్ళంటే భయపడిన మాట నిజమే. ఇప్పుడు అటువంటిది ఏమీ లేదు.

వర్షం పెద్దదయింది. పోలీసు గేటుకు ఆనుకుని నిలబడ్డాడు. అలాగే నిలబడితే తడిచి ముద్దయి పోతాడు. వర్షం ఆగేట్టు లేదు. పెద్దదవుతున్నట్లుగా ఉంది. పోలీసును లోపలికి పిలిస్తేనో అనిపించి వీధి తలుపు తెరిచి చప్పట్లు కొట్టి పోలీసును పిలిచి "లోపలికి రా" కేకేసి బయటి లైటు వెలిగించాడు మాధవరావు. పోలీసు లోపలకు రాగానే వర్షపుజల్లు లోపలికి రాకుండా తలుపు మూసి గడి పెట్టి సోఫా చూపించి, "కూర్చో" అన్నాడు.

నవ్వి, "వద్దు లెండి. తడిచిపోయి ఉన్నాయి నా గుడ్డలు. కూర్చుంటే మీ సోఫా పాడయిపోతుంది. గంటల తరబడి నుంచోవటం మాకు అలవాటేనండీ" అని టోపీ తీసి సెంటర్ టేబిలు మీద పెట్టి జేబులోంచి చారల రుమాలు తీసి ముఖం తుడుచుకుని మాధవరావు ముఖంలోకి చూశాడు. అతని చూపులు తీక్షణంగా ఉన్నాయి. కళ్ళు ఎర్రగా ఉన్నాయి. అతని ముఖంలోని నవ్వు మెల్లగా .. మాయమవుతోంది. అతన్ని ఎక్కడో చూశాడు. బాగా పరిచయమున్న ముఖం.

"నిన్నెక్కడో చూశాను...నీ పేరేమిటి?" అడిగాడు మాధవరావు.

"ధనరాజు" వర్షం తగ్గే సూచనలు కనిపించడం లేదు.

ధనరాజును ఎక్కడ చూశాడు? కృష్ణ పుష్కరాల్లోనా?

ఫోను మోగింది. అందుకుని, "మాధవరావును మాట్లాడుతున్నాను" అన్నాడు.

"నేను చిలకలగూడ పోలీసుస్టేషన్ నుండి సి.ఐ.ని మాట్లాడుతున్నాను. మీరు క్షేమంగా ఉన్నారు కదా?"

"ఆ. మీ సహాయానికి చాలా థాంక్స్. నా కిప్పుడు కొండంత ధైర్యం వచ్చింది. మీకు శ్రమ కలిగించినందుకు ఏమీ అనుకోకండి."

మాధవరావు మాటలు ఇనస్పెక్టరుకు అర్థంకాలేదు. తనను అతను తప్పు పడుతున్నాడేమో అనుకుని "మేమింతవరకు ఏమీ సహాయం అందించలేకపోయినందుకు విచారిస్తున్నాను. మా వాళ్ళను వేరే పనికి అత్యవసరంగా పంపించాల్సి వచ్చింది." రామానుజం మళ్లీ ఫోను చేస్తాడేమోనని నొచ్చుకున్నట్లు అన్నాడు.

"చింతించడం దేనికి? ధనరాజును పంపించారు కదా."

"మా పోలీసా?"

"ఆ"

"ధనరాజనే పోలీసును మేము పంపించటమా? లేదు. మేము పంపించలేదు ఎవరినీ. మా స్టేషన్‌లో అసలు ధనరాజు అనే పేరుగల వ్యక్తే లేదు. ఆ వచ్చినతను యూనిఫాంలో ఉన్నాడా?"

"అవును."

"ప్రస్తుతం అతను మీ ఎదురుగా ఉన్నాడా?"

"కొద్ది దూరంలో ఉన్నాడు."

"చేతిలో కత్తిగాని కర్ర గానీ ఉన్నాయా?"

"లేవు, ఏమీ లేవు."

"అతని చొక్కా మీద నెంబరు ఉందేమో చూడగలరా?"

"చూశాను. లేదు."

అటు నుండి వెంటనే జవాబు రాకపోయేసరికి మాధవరావు హృదయం వేగంగా స్పందించడం మొదలెట్టింది. వెన్నులో భయం సన్నగా బయల్దేరి వళ్ళంతా పాకుతోంది. "వచ్చినవాడు పోలీసు కాదంటారా?" కంగారు మొదలయినా నిబ్బరంగానే అడిగాడు.

"మాకూ అదే అనుమానం వేస్తోంది. మీరే మాత్రం భయపడకుండా ఒక్క పదినిమిషాలు మొండి ధైర్యంతో నిలబడగలిగారంటే మీ దగ్గిర మేముంటాం..." అని సి.ఐ ఫోను పెట్టేశాడు.

వణుకుతున్న చేత్తో రిసీవరు పెట్టి సిగరెట్ తీసి వెలిగించాడు. బయటకు కాని, లోపలకు కాని పరుగెత్తి పారిపోదామనిపిస్తోంది. కాళ్ళు భూమికి అతుక్కుపోయినట్టు ఎటూ కదలలేకపోతున్నాడు. ధనరాజు వంక చూడటానికి భయం వేస్తోంది.

పావుగంట తర్వాత కాని పోలీసులు రాలేదు. వాళ్ళు వేన్ దిగి వచ్చేసరికి వీధి తలుపు బార్లా తెరిచి ఉంది. మాధవరావు డైనింగ్ టేబుల్ పక్కనే నేలమీద బోర్లా పడి ఉన్నాడు. అప్పటికి అతని ప్రాణం పోయి అయిదు నిమిషాలు అయి ఉంటుంది. ఒంటిమీద ఎటువంటి గాయాలు కాని, దెబ్బలుకాని లేవు. అక్కడ పెనుగులాట జరిగిన సూచనలు కనబడలేదు. అయితే, అతను తొడుక్కున్న దుస్తులు మటుకు నీళ్లలో మునిగినట్లు తడిచిపోయి ఉన్నాయి. తల మటుకు పొడిగా ఉంది. ఆ నీళ్ళు అతనే పోసుకున్నాడో, ఎవరయినా పోశారో ఎవరికీ అర్థం కాలేదు.

శవపరీక్షలో మాధవరావు గుండె ఆగి చనిపోలేదని తేలింది. విషప్రయోగం వలన అతను చనిపోయాడని నిర్ధారించారు. ఆ విషం సయినైడ్ కాదు. పురుగుల మందు కాదు. ఎండ్రిన్ కూడా కాదు. అది అతను తీసుకున్నాడో, ఎవరయినా ఇచ్చారో కూడా అంతుబట్టలేదు. అయిదు సంవత్సరాల కిందట నాగమణి ఇటువంటి పరిస్థితిలోనే చనిపోయింది. అయితే ఆ విషయం ఎవరికీ తెలియదు. మాధవరావు తెలియనీయలేదు.

(యల్.పి. హార్ట్‌లో రచన డబ్ల్యు.యస్ చదివిన తర్వాత)

◆ విజయ, మాసపత్రిక - ఏప్రిల్ 1984